క్లుప్తంగా

ఘనంగా మండల అభిషేక పూజలు



ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరి విజయ గణపతి ఆలయంలో శనివారం మండల అభిషేక పూజలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించి 40 రోజులు పూర్తి కావడంతో మండల పూజలు నిర్వహించారు. మహాగణపతి హోమం, కలశ, విశేష పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. సర్పంచ్ మునిరామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడి నియామకం



ఎరికంబట్టు సారకాయలు

నారాయణవనం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నారాయణవనం మండల అధ్యక్షుడిగా ఎరికంబట్టు సారకాయలు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వరుసగా మూడో సారి సారకాయలు పార్టీ మండల అధ్యక్షునిగా నియమితులు కావడంపై వైఎస్సార్ సీపీ వర్గాలు హర్షం ప్రకటించాయి.

బంగారు తాళిబొట్టు బహూకరణ



శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి శనివారం హైదరాబాద్‌కు చెందిన వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి సుమారు రూ.లక్ష విలువ గల బంగారు తాళిబొట్టు, వెండిగిన్నెను వితరణగా అందజేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

70 మద్యం బాటిళ్ల స్వాధీనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని పెట్రోల్ బ్యాంకు వద్ద శుక్రవారం రాత్రి మద్యం బాటిళ్లు తరలిస్తున్న మహిళను పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు. సూళ్లూరుపేట మండలం తాగేలు గ్రామానికి చెందిన వెంకటరత్నమ్మ గ్రామంలో అక్రమంగా విక్రయించేందుకు స్థానిక మద్యం షాపుల్లో 70 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నకిలీ పత్రాలతో ప్లాట్ విక్రయం

ఏర్పేడు: నకిలీ పత్రాల ద్వారా ప్లాట్లు విక్రయించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శనివారం తెలిపారు. మండలంలోని వికృతమాల రెవెన్యూలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో మోసపూరిత పత్రాలతో రాజశేఖర్ చౌదరి తమకు ప్లాట్లు విక్రయించాడని బాధితుడు వెంకట ప్రదీప్‌కుమార్ ఫిర్యాదు చేసినట్లు వివరించారు. విచారణ అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

చదువుపైనే దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటనరసింహం

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులు చదువుపైనే దృష్టి సారిస్తూ, సెల్‌ఫోన్స్, టీవీలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు పలు విషయాలపై సూచనలు ఇచ్చారు. సెల్‌ఫోన్ గేమ్స్‌కు అలవాటు పడితే చదువుపై ఏకాగ్రత తగ్గుతుందని పేర్కొన్నారు. చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం వస్తుందని, పేదరికం దూరం అవుతుందని తెలిపారు. చేడు స్నేహాలు, చేడు అలవాట్లకు బానిసలు కావద్దని, విద్యార్థి దశలో చాలా జాగ్రత్తగా వ్యవహరించి, మంచి వ్యక్తిత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. హెచ్ఎం రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీ శ్రీచైతన్య పాఠశాలలో శనివారం డాక్టర్ మోహన్ చౌదరి ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రూపాదేవి మాట్లాడుతూ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఈనెల బీహెల్దీ, బీహ్యాపీ అనే అంశంపై అవగాహన కలిగించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

అందరికీ వైద్య సేవలే లక్ష్యం



నారాయణవనం: జగనన్న సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం



శ్రీకాళహస్తి : వైద్య పరీక్షలకు వచ్చిన వారితో మాట్లాడుతున్న పవిత్రారెడ్డి

నారాయణవనం: ఇంటింటికీ మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం మండలంలోని భీమునిచెరువు సచివాలయం వద్ద జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలనతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలను తీసుకున్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల వాసులు ప్రారంభ దశలో రోగాలను గుర్తించలేక, వైద్య సలహాలను పొందలేక ప్రాణాలను కోల్పోయే ప్రమాదం నుంచి సీఎం జగనన్న సురక్ష ఆరోగ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గడప గడపకు వచ్చి ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలను నిర్వహించారని పేర్కొన్నారు. గ్రామాల్లోనే శిబిరాలను ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రుల్లో వైద్య సేవలను అందిస్తారని. అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. వెల్‌నెస్ కేంద్రాలను పీహెచ్‌సీ వైద్యులు క్రమం తప్పకుండా సందర్శించాలని, నడవలేని రోగులకు ఇళ్ల వద్దకే వెళ్లి సేవలను అందివ్వాలని సూచించారు. పేదలు అవసరానికి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వేల రూపాయల బిల్లులను చెల్లించి అప్పులు పాలవుతున్నారని అన్నారు. మెరుగైన వైద్య సేవల కోసం ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు, ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫార్సు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమునిచెరువు పంచాయతీలో 70 మందికి రూ.5 లక్షల జగనన్న సురక్ష వైద్య బీమా కార్డులను ఆయన అందజేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

శ్రీకాళహస్తి: మండలంలోని అక్కుర్తి సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు విచ్చేశారు. వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్లు మందులు అందజేశారు. కంటి సమస్యలున్న వారికి అద్దాలు అందజేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఏరాష్ట్రంలో ఇలాంటి పథకం లేదన్నారు. పేద వర్గాలు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయిలో స్పెషలిస్టు వైద్యులతో వైద్యం పొందవచ్చని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు వయ్యాల కృష్ణారెడ్డి, భానుమూర్తి, మల్లం కృష్ణయ్య, సురేంద్రయాదవ్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు వద్ద కూడా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ వైద్య సేవలే లక్ష్యం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : ప్రజలందరికీ వైద్యసేవలు అందించాలన్నదే జగనన్న సురక్ష లక్ష్యమని రాష్ట్ర నోడల్ ఆఫీసర్ రమాదేవి అన్నారు. శనివారం తొట్టంబేడు సచివాలయం-2లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ స్పెషలిస్టు వైద్యులతో చికిత్సలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈశిబిరంలో 358 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఎంపీడీవో సురేష్‌బాబు, ఈవోపీఆర్డీ తరుణాక్షిరెడ్డి, సర్పంచ్ సుబ్బయ్య, పంచాయితీ సెక్రటరీలు, వైద్యాధికారులు సాయిపూజిత, హరిత, శివ, సంపత్, వైద్యసిబ్బంది సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని వెస్టువరత్తూరు సచివాలయ పరిధిలోని నెలవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. పీహెచ్‌సీ వైద్యాధికారి దివాకర్ ఆధ్వర్యంలో వైద్యులు రాజేష్, పవిత్ర 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ, రక్త పరీక్షలు చేశారు. బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులు, తగిన బరువులేని పిల్లలు, క్షయ, కుష్ఠు, వ్యాధులు కలిగిన వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు పంపిణీ చేయనున్నారు. పెద్ద చికిత్సలు అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ కింద రెఫరల్ చేస్తామని తెలిపారు. గ్రామ కార్యదర్శి శివకుమార్, వైద్య సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.



నారాయణవనం: వైద్య పరీక్షలు చేసుకుంటున్న ఎమ్మెల్యే ఆదిమూలం



బీఎన్‌కండ్రిగ : నెలవాయిలో వైద్య పరీక్షలు



తొట్టంబేడు: కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న రాష్ట్ర నోడల్ ఆఫీసర్ రమాదేవి

గడప గడపలో సంక్షేమ కాంతులు



రేణిగుంట పాంచాలీనగర్‌లో బుక్‌లెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి
- జగనన్న జనరంజక పాలనతో ఇంటింటా ఆత్మీయ స్వాగతం
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



గౌరీనగర్‌లో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికి నవరత్నాల రూపంలో సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం ఆయన రేణిగుంట పట్టణం పాంచాలినగర్, గౌరీనగర్‌లలో పర్యటించారు. తొలుత ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికి గజమాల, శాలువాలతో సత్కరించారు. మహిళలు కర్పూర హారతులు పట్టారు. డప్పు, వాయిద్యాలు, భారీ బాణాసంచా పేలుళ్ల సందడితో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. నవరత్న పథకాల లబ్ధిపై ఆరా తీశారు. సీఎం జగనన్న పార్టీలు, రాజకీయాలను చూడకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా వలంటీర్‌ను ఇంటికి పంపి పథకాలను పారదర్శకంగా అందజేస్తున్నారని మహిళలు ఎమ్మెల్యేతో తమ సంతోషాన్ని పంచుకున్నారు. నాలుగేళ్లలో తమకు రూ.లక్షలు నగదు నేరుగా ఖాతాల్లో జమ అయ్యిందని, దీంతో తమ జీవన శైలిలో మార్పు వచ్చిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. జగనన్నకు వచ్చే ఎన్నికల్లో తోడుగా నిలిచి మరోసారి గెలిపించుకుని సంక్షేమ పాలనను కొనసాగించేలా చేస్తామని వారంతా ఎమ్మెల్యేకు మాటిచ్చారు. ఎవరైనా అర్హులై ఉండి సాంకేతిక కారణాల చేత పథకాలు అందకుండా ఉంటే దరఖాస్తు చేసుకుంటే లబ్ధి చేకూరుస్తామని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎన్నికలకు ముందు జనాల్లోకి వెళ్లాలంటే అధికారంలో ఉన్న వారికి సవాలుతో కూడుకున్న విషయమన్నారు. అయితే జగనన్న అందించిన జనరంజక పాలన వల్ల తనను ప్రతి ఇంటా ఆత్మబంధువుగా సాదరంగా ఆహ్వానిస్తూ ఆనందం వ్యక్తం చేస్తుండడం చూస్తుంటే ప్రభుత్వ పాలన పట్ల వారికున్న విశ్వాసం తెలుస్తోందన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా 2024 ఎన్నికల్లో జగనన్న ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, మండల అధ్యక్షుడు గంగారి రమేష్, నాయకులు జువ్వల దయాకర్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, ఎంపీటీసీ సభ్యులు జువ్వల ధనంజయరెడ్డి, వెంకటసుబ్బమ్మ, సుందరమూర్తి, రసూల్, ఖదీర్, ఇరానీ ఖాదర్, రఫీవుల్లా, షబ్బీర్ అహ్మద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగరాజు, మల్లిరెడ్డి, ఎంజీ రాజేష్, జాన్‌బాబు, శీనాచ్చారి, సోలా మల్లికార్జునరెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

పిచ్చాటూరు: అక్టోబర్ 4 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి గాయత్రి తెలిపారు. శనివారం శిబిరాల షెడ్యూల్‌ను ఆమె విడుదల చేశారు. 4వ తేదీన రామాపురం సచివాలయం, 5న కారూరు ప్రాథమికోన్నత పాఠశాల, 6న ముడియూరు సచివాలయం, 7న రామగిరి ఎంపీపీ స్కూల్, 9న వెంగళత్తూరు జెడ్పీ హైస్కూల్, 10న గోవర్ధనగిరి సచివాలయం, 11న పులికుండ్రం సచివాలయం, 12న ఎస్ఎస్‌బీ పేట ఎంపీపీ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని వెల్లడించారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

యువతే ప్రపంచ భవిత



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జీవీప్రభాకర్‌రెడ్డి

ఏర్పేడు: నేటి యువతే రేపటి ప్రపంచ భవిష్యత్తని ప్రిన్సిపల్, ఆర్ఐఓ జీవీప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే జరిగింది. ఆయన మాట్లాడుతూ చదువే ఉన్నత స్థానానికి చేర్చుతుందని పేర్కొన్నారు. జ్ఞానానికి మించిన ఆయుధంలేదన్నారు. క్రమ శిక్షణతో ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉమ, శ్రీమన్నారాయణ, రాఘవరెడ్డి, అమరేశ్వర్‌రెడ్డి, ఎన్‌వీసురేష్, శంకరప్ప, వెంకటసుబ్బమ్మ, సువర్ణ, సోమశేఖర్ బాబు, షమీర్ అహ్మద్, నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

ఏర్పేడు: మండలంలోని చెన్నంపల్లిలో జరిగిన హత్య కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శనివారం రాత్రి తెలిపారు. గత నెల 29న రేణిగుంట మండలంలోని కల్లూరు దళితవాడకు చెందిన మోహన్‌బాబు(45) ఏర్పేడు మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన మునిరెడ్డి ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడని పేర్కొన్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం హత్య కేసుగా నమోదు చేసి నిందితులు చెన్నంపల్లెకు చెందిన మునిరెడ్డి, చెంగారెడ్డి, రాజగోపాల్‌రెడ్డిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ చెప్పారు.

ముగిసిన ఆర్య వర్క్ శిక్షణ

తిరుపతి కల్చరల్: పద్మావతి మహిళా వర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డి.ఉమాదేవి ఆధ్వర్యంలో రేణిగుంటలోని వీవో కార్యాలయంలో స్వయం సహాయక సంఘం మహిళలకు చేపట్టిన వారం రోజుల ఆర్య వర్క్ శిక్షణ శనివారం ముగిసింది. పలువురు మహిళలు మాట్లాడుతూ ఆర్య వర్క్ నేర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాము ఉపాధి పొందుతూ మరి కొందరికి ఉపాధి అందిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్ టి.పద్మావతి, ఎం.ఇంద్రాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇస్రో వరల్డ్ స్పేస్ పోటీ పరీక్షలు



రేణిగుంట: పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



రేణిగుంట: విద్యార్థినులకు బహుమతుల ప్రదానం



ఏర్పేడు: పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రేణిగుంట: రేణిగుంట ఎమ్మార్సీలో శనివారం ఇస్రో వరల్డ్ స్పేస్ వీక్ పోటీ పరీక్షలు, రెడ్ రిబ్బన్ క్విజ్ మండల స్థాయి పోటీలు జరిగాయి. 6,7 తరగతి విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు, 8,9,10 తరగతుల విద్యార్థులకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. పెయింటింగ్ విభాగంలో రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మొదటి స్థానం, రెయిన్‌బో, ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. క్విజ్ పోటీల్లో శ్రీవిద్యా స్కూల్, రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల, రెయిన్‌బో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నారు. గెలుపొందిన వారిని ఎంఈవో ఇందిరాదేవి అభినందించి బహుమతులను అందజేశారు. అలాగే రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో అంతరిక్ష గురుకుల్, స్ప్రెడ్ స్మైల్ సంస్థల సహకారంతో మోడల్ రాకెట్ లాంచింగ్ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం విష్ణువర్ధనం, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ సారథి, కోదండపాణి పాల్గొన్నారు.

క్విజ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ఏర్పేడు: ఇస్రో వరల్డ్ స్పేస్ వీక్ క్విజ్ పోటీల్లో మండలంలోని పల్లం విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శనివారం ఏర్పేడు జెడ్పీ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించగా, విద్యార్థులు హేమ, ధన్యశ్రీ, విష్ణుప్రియ మొదటి మూడు బహుమతులను గెలుపొంది శ్రీహరికోటలో జరిగె జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. డ్రాయింగ్ విభాగంలో మహేష్ జిల్లా స్థాయికి ఎంపికై నట్లు వెల్లడించారు. మండలంలోని బండారుపల్లె జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కల్యాణి బహుమతి పొందినట్లు హెచ్ఎం నిర్మల్‌కుమార్ తెలిపారు.

ఆలయాల్లో పెరటాశి రద్దీ



నారాయణవనం: పవిత్రాలతో కల్యాణ వెంకన్న



నారాయణవనం: దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



బీఎన్‌కండ్రిగ: విశేషాలంకరణలో స్వామివారు



సత్యవేడు: పూజల్లో పాల్గొన్న భక్తులు



నారాయణవనం : ఆహార పొట్లాల పంపిణీ

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం తమిళ పెరటాశి రెండవ శనివారం సందర్భంగా భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమలను పూర్తి చేశారు. పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా ఉభయ నాంచారుల సమేత కల్యాణ వెంకన్నకు ప్రత్యేక స్నపన తిరుమంజనం నిర్వహించి, తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. మూలవర్లకు, పరివార దేవతలతో పాటు ఉత్సవ మూర్తులకు పవిత్రాలను సమర్పించి, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. పెరటాశి నెల కావడంతో ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని దర్శించుకునే భక్తులందరికీ ప్రసాదాలను అందించే ఏర్పాటు చేపట్టారు. రాత్రి 8.30 గంటల వరకు సుమారు 10వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేడుకగా పెరటాశి పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట, కారణి, బుచ్చినాయుడుకండ్రిగ ఆలయాల్లో పెరటాశి రెండవ శనివారం విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాల పంపిణీ జరిగింది. ఉత్సవమూర్తులకు ఉంజల్‌సేవను నిర్వహించారు. ఉదయం నుంచి గోవింద భజన కార్యక్రమం జరిగింది. పండరి భజన కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.

అలరించిన హరి నామ సంకీర్తన

సత్యవేడు: శ్రీసిటీ పరిధి ఆరూరులోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో హరి నామ సంకీర్తనల భజనలు అలరించాయి. పెరటాసి రెండవ శనివారం కావడంతో ఇరుగుళం గ్రామానికి చెందిన శ్రీతిరువెంకట రామానుజ భక్త సమాజం భజన బృందం హరినామ సంకీర్తలు భజన నిర్వహించారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో జరిగిన భజన కార్యక్రమం బృందం పెద్ద గుణ శేఖర్ మాట్లాడుతూ నవ విధ భక్తి మార్గాలలో నామ సంకీర్తన, భజన భగవంతునికి మిక్కిలి ప్రీతి కరమన్నారు. నిత్యం హరి నామస్మరణ చేయాలని కోరారు ఆరూరు, ఆరూరు కండ్రిగ, ఇరుగుళం, మల్లవారిపాళెం ఈస్టు, మల్లవారిపాళెం వెస్టు భక్తులు పాల్గొన్నారు.

గోవింద భక్తులకు అన్నదానం

నారాయణవనం: మండలంలోని వెత్తలతడుకు వద్ద శనివారం తిరుమలకు కాలినడకన వెళ్లే గోవింద మాల భక్తులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన వెంకటేష్ మాట్లాడుతూ తమిళ పెరటాశి రెండవ శనివారం సందర్భంగా చెన్నై నుంచి కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులకు ఏటా ఆహార పొట్లాలు అందజేస్తున్నట్లు తెలిపారు. శనివారం సుమారు 150 మంది భక్తులకు ఆహార పొట్లాను అందజేశామన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం : మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీ వేదవల్లీ సమేత వేదనారాయణ స్వామి ఆలయంలో పెరటాశి రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకం అనంతరం శ్రీస్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. భక్తులు వీక్షించి తరించారు.

భాష్యంలో టాలెంట్ హబ్



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్ భాష్యం పాఠశాలలో శనివారం టాలెంట్ హబ్ కార్యక్రమం జరిగింది. జెడ్ఈవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ హర్షవర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలన్న ఉద్దేశంతో బీఐటీఎస్ఈ, బీటీఆర్, బీబీసీ, బీడబ్ల్యూసీ, ఎస్ఐఈ, ఎస్ఎంఎస్ తదితర కార్యక్రమాలను నిర్వహించి, ప్రతిభావంతులకు బహుమతులను వారి తల్లిదండ్రుల సమక్షంలో బహూకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు సీఆర్ఎస్‌లో స్వచ్ఛ్ పక్వాడా

రేణిగుంట: స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం రేణిగుంట సీఆర్ఎస్ ఆవరణలో స్వచ్ఛ్ పక్వాడా పేరుతో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపడుతున్నట్లు సీఆర్ఎస్ చీఫ్ వర్క్స్ మేనేజర్ దేవసహాయం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పాల్గొని సీఆర్ఎస్ సిబ్బందితో కలసి శ్రమదానం చేస్తారని పేర్కొన్నారు.